సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 27 । జూన్ । 2025



వాక్‌థాన్‌లో పాల్గొన్న వివిధ వర్గాల ప్రజలు, పలు శాఖల అధికారులు, సిబ్బంది

కూటమి మాస్టర్ ప్లాన్ తుస్!



పునః పరిశీలనలో కేవలం **755** ఫిర్యాదులు

వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌పై భూటకపు ప్రకటనలు

వైఎస్సార్‌సీపీ హయాంలో అశాస్త్రీయంగా ప్రణాళిక సిద్ధం చేశారని ఆరోపణలు

పునఃపరిశీలన పేరుతో నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

కేవలం 755 ఫిర్యాదుల రాక.. అవి కూడా పాత విజ్ఞప్తులే..

కూటమి ప్రజాప్రతినిధుల చేసిన ఆరోపణలు అవాస్తవమని నిరూపణ

అయినా తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్లాన్‌లో మార్పులకు ఒత్తిళ్లు

విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వ 'మాస్టర్ ప్లాన్' బెడిసికొట్టింది. వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళికపై చేసిన ఆరోపణలు తప్పని తేటతెల్లమైంది. కేవలం కూటమి నేతల రియల్ వ్యాపారానికి వీలుగా ప్రణాళికలో మార్పులు చేసుకోవడానికే పునఃపరిశీలన హడావుడి చేసినట్లు స్పష్టమవుతోంది. తమ వారికి లబ్ధి చేకూర్చడానికి బూటకపు ప్రకటనలు చేసి నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ చేపడితే కేవలం 755 ఫిర్యాదు అందాయి. అవి కూడా గతంలో వచ్చిన విజ్ఞప్తులే కావడం గమనార్హం. కూటమి నేతల పాచిక పారకపోయినప్పటికీ.. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి బృహత్తర ప్రణాళికలో పలు సవరణలు చేసి ప్రజాప్రతినిధుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసేందుకు అడుగులు వేస్తోంది.

2021లోనే మాస్టర్ ప్లాన్ పూర్తి

వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బృహత్తర ప్రణాళిక-2041కు ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి 2011లో ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఏళ్లు గడిచినా అది పూర్తి కాకపోవడంతో 2016లో ప్రైవేట్ కన్సల్టెంట్ సంస్థ లీ అసోసియేట్స్‌కు రూ.10 కోట్లకు ఆ బాధ్యతను అప్పగించారు. 2019కి కూడా అది పూర్తి కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాస్టర్‌ప్లాన్‌పై దృష్టి సారించింది. దీని రూపకల్పన సమయంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో 46 మండలాలు, 1,312 గ్రామాలున్నాయి. ప్రణాళికను రూపొందించేందుకు విశాఖలోని 45 రెవెన్యూ గ్రామాలు, 55 మత్స్యకార గ్రామాలు, 13 వార్డులను పరిగణనలోకి తీసుకొని.. సలహాలు, సూచనలు ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా వివరాలు సేకరించారు. అలాగే విజయనగరం జిల్లాలోని 48 రెవెన్యూ గ్రామాలు, 19 మత్స్యకార గ్రామాలు, 5 వార్డులు, రెండు వర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందుకోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మొత్తంగా 17,460 అభ్యంతరాలు, సలహాలు వచ్చాయి. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, ఇతర సంబంధిత విభాగాల అధికారులతో సంయుక్త తనిఖీలు, సందర్శనలు నిర్వహించి వాటిన్నింటినీ పరిశీలించారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. ఆ ప్రాంత భౌగోళిక స్థితిగతులను అనుసరించి విభిన్న కోణాల్లో ఆలోచన చేసి ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. దానికి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో 2021 నవంబర్ 8న వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041కు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

తప్పుడు ఆరోపణలు పటాపంచలు

ఈ బృహత్తర ప్రణాళిక-2041పై కూటమి నేతలు ఎన్నికల ముందు నుంచి ఆరోపణలు గుప్పించారు. పాలకులకు అనుకూలంగా మాస్టర్‌ప్లాన్‌ను అశాస్త్రీయంగా తయారు చేశారని నానా యాగీ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాస్టర్‌ప్లాన్‌పై మళ్లీ అభ్యంతరాలు స్వీకరించి కొత్త ప్లాన్‌ను రూపొందిస్తామని చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లికి జరగాలి పెళ్లి.. మళ్లీ మళ్లీ.. అన్నట్లు.. బృహత్తర ప్రణాళికపై పునఃపరిశీలనకు పూనుకున్నారు. ఇందులో గతంలో కంటే అధికంగా ఫిర్యాదులు వస్తాయని భావించారు. వాటి ద్వారా మాస్టర్ ప్లాన్ అవకతవకలు జరిగాయని నిరూపించడానికి విశ్వప్రయత్నాలు చేశారు. మే 22 నుంచి ఈ నెల 21 వరకు నెల రోజుల పాటు మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలను స్వీకరించారు. ఇందులో కేవలం 755 ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు. ఇవి కూడా గతంలో వచ్చిన ఫిర్యాదులుగానే తెలుస్తోంది. ఈ ఫిర్యాదుల బూచితో తమ అనుచరుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిగా మార్చాలని ఆశపడ్డారు. కానీ అందుకు విరుద్ధంగా జరగడంతో కూటమి నేతలు ఏం చేయాలో పాలుపోక మాస్టర్‌ప్లాన్‌పై నోరెత్తలేక సైలెంట్ అయిపోయారు.

'కూటమి'కి లబ్ధి చేకూరేలా?

కూటమి ప్లాన్ పారకపోయినప్పటికీ.. మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయాలని గట్టి నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులకు లబ్ధి చేకూర్చాలన్న ఆలోచనతో ఈ ప్రణాళికలో సవరణ చేయాలని అధికారులపై ఒత్తిళ్లకు దిగుతున్నట్లు సమాచారం. ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాల పేరుతో కూటమి నేతలు సూచించిన విధంగా ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేపట్టాలని భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలు, వారి అనుచరుల స్థిరాస్తి వ్యాపారాలు, వ్యక్తిగత ఆస్తుల విలువ పెంచుకునేందుకు మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రణాళికలను మార్పులు చేసుకునే ప్లాన్ చేస్తున్నట్లు కూటమిలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా మధురవాడ నుంచి ఆనందపురం మధ్యలోను, అలాగే అనకాపల్లిలో పలు చోట్ల మార్పులు, చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డులో వాక్‌థాన్

మహారాణిపేట: డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి యువతకు పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ అభియాన్'లో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని గురువారం బీచ్‌రోడ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. ఎన్‌సీబీ(నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో), ఎస్‌బీఐ, ఈగల్ టీం, విభిన్న ప్రతిభావంతులు, పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ వాక్‌థాన్‌లో వేలాది మంది పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఇతర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని, జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువతకు అందుబాటులో లేకుండా చూడాలన్నారు. డ్రగ్స్, గంజాయి సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నగరంలో విస్తృత తనిఖీలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరాను అరికట్టడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనుకోకుండా మాదక ద్రవ్యాల ఉచ్చులో పడిన వారు పునరావాస కేంద్రాలను(కేజీహెచ్‌లో ఒకటి, మానసిక వైద్యశాల పరిధిలో మరొకటి) సంప్రదించవచ్చన్నారు. నషా ముక్త్(14446), ఈగల్ (1972), టెలీ మానస్ సెంటర్(1933) టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా సహాయం పొందవచ్చని, డ్రగ్స్ సమాచారం తెలపవచ్చని సూచించారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకుని జీవితాలను చీకటిమయం చేసుకోవద్దని యువతకు హితవు పలికారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీ అజిత, ఎన్‌సీబీ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్ కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, యువత, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశాఖ ఎంపీ భరత్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు

నగరాభివృద్ధి, సుందరీకరణే లక్ష్యం

కమిషనర్ కేతన్ గార్గ్



పర్యవేక్షక ఇంజినీర్లతో సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: నగరాభివృద్ధి, సుందరీకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేసేలా చూడాలని, ఈ పనుల్లో వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జోన్ల వారీగా చేపట్టిన పనులు, పూర్తయిన పనుల పురోగతి, ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. అన్ని జోన్లలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదిక అందించాలని పర్యవేక్షక ఇంజినీర్లను ఆదేశించారు. నగరంలో చేపట్టిన బీటీ, సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు, భూగర్భ కేబుల్ పనుల వివరాలను ఇంజినీర్లు కమిషనర్‌కు వివరించారు. అనంతరం మధురవాడలో చేపట్టబోయే భూగర్భ మురుగు నీటి పారుదల ప్రాజెక్టు పనులపై ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో కమిషనర్ సమీక్షించారు. సింహాచలం గిరి ప్రదక్షిణ మార్గం, బీచ్ నుంచి ఎండాడకు అనుసంధాన మార్గం, అనకాపల్లి పెరుగు బజార్ రోడ్డు, పలు మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు, తగరపువలస-చిల్లపేట పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి వీఐపీ రోడ్డు వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌లో పచ్చదనం పెంచాలని, రోడ్లపై జీబ్రా క్రాసింగ్‌లు, కూడళ్ల వద్ద అవసరమైన పెయింటింగ్ పనులు చేపట్టాలని, వీటికి సంబంధించిన అంచనాలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, కేవీఎస్ **రవి,** పీవీవీ సత్యనారాయణరాజు, సంపత్‌కుమార్, **కె.శ్రీ**నివాసరావు, వై.కృష్ణారావులతో పాటు పలు**వురు** కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

70 కేసుల్లో 65 మంది అరెస్ట్

రూ.1.04 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు



బాధితురాలికి బంగారు ఆభరణాన్ని అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగరంలో నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో మే నెలలో 82 చోరీ కేసులు నమోదైనట్లు చెప్పారు. వాటిలో 70 కేసులను ఛేదించి 65 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.1,04,97,450 చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో 1.04 కిలోల బంగారం, 6.06 కిలోల వెండి, రూ.9,09,900 నగదు, 14 ద్విచక్ర వాహనాలు, 392 మొబైల్ ఫోన్లు, పాక్లెయినర్, కారు, ల్యాప్‌టాప్, ఇతర **వస్తువులను రికవరీ చేసినట్లు వివరించారు. నగరంలో నేర నియంత్ర**ణకు, నిందితులను గుర్తించేందుకు వీలుగా మేలో 610 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు ప్రజలు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో పగలు, రాత్రుళ్ల ప్రత్యేక బృందాలతో పాటు డ్రోన్ల ద్వారా కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందజేశారు. సమా**వేశంలో డీసీపీ(క్రైం) లతా మాధురి, ఇతర అధికారు**లు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో మొత్తం 286 అంశాలు చర్చకు రానున్నాయి. వీటిలో మినిస్టీరియల్ సిబ్బంది సర్వీసు అంశాలతో పాటు పలు రెవెన్యూ, అభివృద్ధి సంబంధిత అంశాలు సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నారు. సమిష్టి స్వచ్ఛంద సేవా సొసైటీ నిర్వహిస్తున్న భూపేష్‌నగర్ నైట్ షెల్టర్ కాల పరిమితిని రెండేళ్లకు పునరుద్ధరించడం, జోన్-1లోని తగరపువలస, చిట్టివలస రోడ్డు మార్జిన్ మార్కెట్ ఆశీలు వసూలు లీజుకు ఇవ్వడం, లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్, చిన్న బజారు కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్ల రోజువారీ ఆశీలుకు సంబంధించిన అంశాలు, 2025-26 సంవత్సరానికి ముడసర్లోవ పార్క్ క్యాంటీన్ నిర్వహణ కాంట్రాక్ట్, అన్ని జోనల్ కార్యాలయాల పరిధిలోని వాణిజ్య సముదాయాల కాంట్రాక్ట్ పొడిగింపు, 58వ వార్డు ములగాడలో రూ. 47.50 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణం, 60వ వార్డు శ్రీహరిపురంలో యారాడ పార్క్ నుంచి శ్రీహరిపురం కూడలి వరకు డ్రెయిన్ నిర్మాణం, 62వ వార్డులో అచ్చింనాయుడుతోటలో వరద నీటి కాలువ నిర్మాణం, పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వంటి అంశాలపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదం తెలపనున్నారు.

ఆస్పత్రుల్లో అవయవదానం బోర్డుల ఏర్పాటు

వైద్యుల సమావేశంలో అవయవదాన రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ రాంబాబు

ఆరిలోవ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవయవదానంపై అవగాహన కలిగించే బోర్డులను ఏర్పాటు చేయాలని అవయదాన రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈస్ట్ జోన్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. అవయదానం విధివిధానాలపై చర్చించారు. వైద్యుల నుంచి సూచనలు, సలహాలు సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 73 ఆస్పత్రులను జీవనదాన్ కింద నమోదుచేసినప్పటికీ వాటిలో సుమారు 50 శాతం ఆస్పత్రుల్లో ఒక్క బ్రెయిన్ డెడ్ కేసు కూడా నమోదు కాకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసులు జరుగుతున్నప్పటికీ, వాటిని నమోదుచేసి ప్రకటించడంలో ఆయా ఆస్పత్రుల వైద్యాధికారులు ఆసక్తి చూపడంలేదన్నారు. అవయదానంపై రోగి బంధువులకు సరైన అవగాహన లేకపోవడంతోపాటు, అవయవాలను **శరీరం నుంచి** బయటకు తీయడానికి సరైన **వైద్యులు అందు**బాటులో లేకపోవడం కూడా కా**రణమన్నారు. అం**దుకే ప్రతి ఆస్పత్రిలో తప్పనిసరిగా అవయదానంపై హెల్ప్ డెస్క్, అవగాహన కోసం బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఆస్పత్రిలోనైనా బ్రెయిన్ డెడ్ శరీరం నుంచి భాగాలు తీసేందుకు వైద్యులు అందుబాటులో లేకపోతే, తన దృష్టికి తీసుకురావాలన్నారు. విమ్స్‌లో ఇంత వరకు మూడు బ్రెయిన్ డెడ్ కేసులను ప్రకటించి అవయవాలు స్వీకరించామన్నారు. ఆస్పత్రుల నిర్వాహకులు మానవతా దృక్పథంతో ఆలోచిస్తే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. పలు ఆస్పత్రుల వైద్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్ర కోసం మరో స్పెషల్

తాటిచెట్లపాలెం: త్వరలో పూరీలో జరగనున్న రథయాత్ర కోసం విశాఖపట్నం నుంచి స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-పూరీ (08313)రథయాత్ర స్పెషల్ జూలై 5వ తేదీ మధ్యరాత్రి 12.45 గంటలకు బయల్దేరి.. 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో పూరీ-విశాఖపట్నం(08314) స్పెషల్ జూలై 7వ తేదీ తెల్లవారు 2.15 గంటలకు పూరీలో బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖపట్నం చేరుకుంటుది. ఈ స్పెషల్ రైలు 4-స్లీపర్ క్లాస్, 6-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ క్లాస్/ దివ్యాంగ కమ్ లగేజి కోచ్‌లతో నడుస్తుంది.

నాడు ప్రణాళికలు.. నేడు వెలుగులు



సాగర్‌నగర్‌లో ఈసీబీసీ భవనం

- **ఇంధన ఆదాకు రోల్ మోడల్‌గా 'ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్' భవనం**
- **వైఎస్సార్‌సీపీ హయాంలో 2023 మేలో సాగర్‌నగర్‌లో పనుల ప్రారంభం**
- **50 శాతానికి పైగా ఇంధనం పొదుపయ్యేలా రూ.14 కోట్లతో భవన నిర్మాణం**
- **పర్యావరణ సవాళ్ల పరిష్కారం, ఇంధన డిమాండ్ తీర్చడంలో ముఖ్య భూమిక**
- **నేడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా భవనం ప్రారంభం**

విశాఖ సిటీ : వెలుతురు ప్రసరణ ఉంటుంది. సూర్యుడి వేడి నియంత్రిస్తుంది.. విద్యుత్ ఆదా అవుతుంది. పునరుత్పాదక శక్తితో నడుస్తుంది. ఇదీ ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిర్మించిన (ఏపీఈపీడీసీఎల్) సూపర్ 'ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్' (ఈసీబీసీ) భవనం ప్రత్యేకత. స్వయం సమృద్ధి విధానంలో విద్యుత్ పొదుపునకు నమూనాగా సాగర్‌నగర్‌లో నిర్మించిన ఈ భవనం దక్షిణాది నగరాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన ప్రణాళికలు నేడు వెలుగులు పంచుతోంది. రాష్ట్రంలోనే మొదటిసారిగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) **రూపొందించిన ఈసీబీసీ నిబంధనలను అనుసరించి రూ.14 కోట్లతో భవనాన్ని నిర్మించింది. ఇది దేశంలోనే ఇతర రాష్ట్రాల్లో కమర్షియల్ భవనాలకు నమూనాగా నిలుస్తోంది. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు 11 జిల్లాలకు విస్తరించిన ఏపీఈపీడీసీఎల్‌లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అధికా**రుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు శిక్షణ కోసం ఈ అధునాతన జీ+2 భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ భవన నిర్వహణకు ఖర్చు లేకుండా.. తిరిగి రూ.లక్షల్లో ఆదాయార్జన చేసేలా తీర్చిదిద్దారు.

ఇంధన పొదుపుపై వైఎస్సార్ సీపీ దృష్టి

విద్యుత్, ఇంధన రంగాల్లో దక్షిణాది నగరాలకు దీటుగా విశాఖను రోల్ మోడల్‌గా నిలిపేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ప్రధానంగా రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో(వాణిజ్య భవనాల్లో) విద్యుత్ డిమాండ్‌ను తగ్గించే అంశంపై దృష్టి పెట్టింది. ఈసీబీసీ నిబంధనలకు అనుగుణంగా కమర్షియల్ భవనాల నిర్మించడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చని భావించింది. ఈ దిశగా విశాఖలో ఏపీఈపీడీసీఎల్ శిక్షణ కేంద్ర భవనాన్ని ఈసీబీసీ నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలని ఆదేశించింది. దీంతో 2023, మే నెలలో సాగర్‌నగర్ ప్రాంతంలో ఎకరన్నర విస్తీర్ణంలో జీ+2 భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి భారత ప్రభుత్వ సంస్థ బీఈఈ రూ.5 కోట్లు ప్రోత్సాహంగా మంజూరు చేసింది. **పగలు విద్యుద్దీపాల అవసరం లేకుండా, ఏసీ వినియోగానికి తక్కువ విద్యుత్ వినియోగం ఉండేలా, విద్యుత్ బిల్లుల భారం తగ్గేలా, 50 శాతం విద్యుత్ ఆదా అయ్యేలా భవన నిర్మాణాన్ని చేపట్టింది. సూపర్ ఈసీబీసీ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ శాఖ శిక్షణాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మిగి**లిన అంతస్తులను ప్రైవేటు సంస్థలకు లీజులకు ఇవ్వనున్నారు. ఈ బాధ్యతలను ఇప్పటికే వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ భవన నిర్మాణం పూర్తయింది. శుక్రవారం రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈసీబీసీ నిబంధనలకు అనుగుణంగా..

- ఈసీబీసీ నిబంధనలను అనుసరించి జీ+2 భవనం ఒక్కో అంతస్తు 14,400 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి నాలుగు ప్రమాణాలను అనుసరించారు.
- సూర్యుని వెలుతురుని నియంత్రించేలా 24 మి.మీ మందం కలిగిన మూడు పొరల గ్లాసులను వినియోగించారు. సాధారణ భవన నిర్మాణాల కిటికీలకు ఒక్క పొర ఉండే గ్లాసులు మాత్రమే వాడతారు. కానీ సూపర్ ఈసీబీసీ నిర్మాణానికి మూడు పొరల గ్లాసులు వినియోగించడంతో భవనంలోకి వేడి తక్కువగా ప్రసరిస్తుంది.
- గోడలను కావిటీ వాల్స్‌తో కట్టారు. బయట గోడ 8 అంగుళాలు, లోపల 4 అంగుళాలు, మధ్యలో ఎయిర్ గ్యాప్ 4 అంగుళాలు మొత్తంగా 16 అంగుళాలు గోడల నిర్మాణంలో ట్రిపుల్ ఏసీ బ్రిక్స్ ఉపయోగించారు. దీంతో వేడి లోపలకు రాదు.
- శ్లాబు పై నుంచి వేడి కూడా రాకుండా 100 డెకింగ్ సీలింగ్ చేశారు. 50 మి.మీ. మందం రాక్ వుడ్‌తో శ్లాబ్‌కి టచ్ అవుతూ ఒక సీలింగ్ వేసి, తర్వాత ఎయిర్ గ్యాప్ ఇచ్చి ఫాల్స్ సీలింగ్ చేశారు. దీంతో శ్లాబ్ నుంచి వేడి కిందకు దిగే అవకాశం ఉండదు.
- విద్యుత్ ఆదా చేయడానికి ఎయిర్ కండిషన్ సిస్టం హెచ్‌వీఏసీ విధానాన్ని అనుసరించారు. హీట్ వెంటిలేటివ్ ఎయిర్ కండిషన్ సిస్టమ్ పద్ధతిలో సెన్సార్ ద్వారా ఆక్యుపెన్సీ బట్టీ కంప్రెషర్ ఆన్, ఆఫ్ వాల్యూం త్రో చేయడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది.
- విద్యుత్ బిల్లు భారం లేకుండా పునరుత్పాదక విద్యుత్ కోసం 50 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించారు.
- ఈసీబీసీ నిబంధనలకు అనుగుణంగా నిర్మించిన భవనాల్లో 50 శాతానికి పైగా విద్యుత్ అవుతుంది.

'సంపత్ వినాయగర్' హుండీ ఆదాయం రూ.17.27 లక్షలు


లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 26 రోజులకు గాను రూ.17,27,278 నగదు, 6.817 గ్రాముల బంగారం, 22.300 గ్రాముల వెండి లభించింది. అలాగే 133 యూఎస్ఏ డాలర్లు, 20 సింగపూర్ డాలర్లు, 40 కెనడా డాలర్స్, 5 యూరో కరెన్సీ వచ్చినట్టు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.వి.ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళస్ తెలిపారు.

నేడు సీఎస్ రాక

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో ఉదయం 8 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు సాగర్‌నగర్‌లో ఏపీఈపీడీసీఎల్ నిర్మించిన సూపర్ ఈసీబీసీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఆరిలోవ: ఈవీఎం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను ఎన్నికల విభాగం అధికారులు, పలు రాజకీయ పక్షాల నాయకులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది గోదాం సీల్ తీయగా.. లోపల ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, సీసీ కెమెరాలను పరిశీలించారు. గోదాం భద్రతా ప్రమాణాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లిక్విడ్ గంజాయి పట్టివేత


గంజాయి, నిందితులతో పోలీసులు

పెందుర్తి: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖ నగరానికి తరలిస్తున్న 1.6 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. పెదబయలుకు చెందిన గుల్లేలి చిన్నంనాయుడు, పురుష్కారి సోమేష్, గెమ్మిలి ప్రసాదరావు, అర్బాబు మత్స్యలింగం కలిసి నగరానికి లిక్విడ్ గంజాయిని తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సమాచారం అందుకున్నారు. సరిపల్లి వద్ద కాపు కాసి వారిని పట్టుకుని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

వీటిని రోడ్లంటారా?


శివాజీపాలెంలో..


ఫిషర్‌మెన్ కాలనీలో..


ఎంవీపీ సెక్టార్-9 ఫిషర్‌మెన్ కాలనీలో..


శివాజీపాలెంలో పైకి వచ్చిన మ్యాన్‌హోల్


ఫిషర్‌మెన్ కాలనీలో రోడ్డు దుస్థితి ఇది



కేఆర్ఎం కాలనీలో


ఎంవీపీకాలనీ సెక్టార్-9లో

స్మార్ట్ సిటీలోని వీధుల్లో రహదారులు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఎక్కడికక్కడ తవ్వకాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్లపై ప్రయాణించడమంటే ప్రాణాలతో చెలగాటమాడటమేనని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలపైనే కాదు కనీసం కాలి నడకన వెళ్లేందుకు కూడా వీల్లేకుండా కొన్ని చోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొద్ది రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 24/7 మంచినీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనుల పేరుతో వీధుల్లో రహదారులను విచక్షణారహితంగా తవ్వేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత ఆ గోతులను పటిష్టంగా పూడ్చకుండా నామమాత్రంగా మట్టి, కంకర వేసి వదిలేస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతాలన్నీ ప్రమాదకరంగా మారాయి. వర్షం నీటితో గోతులు నిండిపోయి, ఏది రోడ్డో.. ఏది గొయ్యో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ద్విచక్ర వాహనదారులు తరచూ అదుపుతప్పి కిందపడుతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని చోట్ల మ్యాన్‌హోల్స్ రోడ్డు కంటే ఎత్తుగా ఉండటం, మరికొన్ని చోట్ల లోపలికి కుంగిపోవడం వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా కేఆర్ఎం కాలనీ, సీతమ్మధార, కృష్ణా కాలేజ్, ఎంవీపీ సెక్టార్-9 ఫిషర్‌మెన్ కాలనీ, శివాజీపాలెం తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ సమస్యపై నగరవాసులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం కూడా ఈ దుస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే.. ముందుగానే తగిన చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మృత్యువుతో పోరాడి ఓడారు

- లంకెలపాలెంలో లారీ బీభత్సం
- ఐదుకు చేరిన మృతుల సంఖ్య


కంటైనర్ డ్రైవర్ అప్పలరాజు(ఫైల్)


వాహనచోదకుడు రాంకుమార్(ఫైల్)

పరవాడ: లంకెలపాలెం కూడలిలో మార్కెట్ లారీ సృష్టించిన బీభత్సంలో విషాదం కొనసాగుతోంది. ఈ నెల 23న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. వేర్వేరు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్న మరో ఇద్దరు గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మృతులను కంటైనర్ డ్రైవర్ రేఖ అప్పలరాజు(విజయరాంపుర అగ్రహారం, రాంబిల్లి మండలం), వాహనచోదకుడు సాలాపు రాంకుమార్ (కొత్తకోట, రావికమతం మండలం)గా గుర్తించారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి అప్పలరాజు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో, రాంకుమార్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. కాగా, ప్రమాదం జరిగిన రోజే అనకాపల్లికి చెందిన కొణతాల అచ్చెంనాయుడు, రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ, అగనంపూడి వాసి ఎర్రప్పడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో ఇద్దరు మరణించడంతో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరికొంత మంది ఇంకా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

అమ్మను తిట్టాడని... కర్రతో కొట్టి చంపేశాడు!

- ఆటోనగర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఫోన్‌కాల్‌తో దొరికిన హంతకుడు


వివరాలు వెల్లడిస్తున్న గాజువాక ఏసీపీ త్రినాథ్

పెదగంట్యాడ: తోటి కార్మికుడు తన తల్లిని, అక్కలను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, నిద్రిస్తున్న తనను కాలితో తన్నాడన్న తీవ్ర ఆగ్రహంతో ఓ వ్యక్తి అతడిని కర్రతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఆటోనగర్‌లో ఇటీవల కలకలం రేపిన ఈ హత్య కేసును న్యూపోర్టు పోలీసులు ఛేదించారు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో గాజువాక ఏసీపీ త్రినాథ్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తార్ జిల్లా జగదల్‌పూర్ తాలుకా నియానార్‌కు చెందిన నరేష్ కశ్యప్, బిలోరికి చెందిన మహాదేవ్ భగేల్(28) ఇద్దరూ పెదగంట్యాడ ఆటోనగర్‌లోని శ్రీకృష్ణ ఇంజినీరింగ్ యార్డులో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 22న సెలవు దినం కావడంతో వారిద్దరూ యార్డులోనే ఉన్నారు. ఆ సమయంలో నరేష్ గదిలో నిద్రపోతుండగా, మహాదేవ్ వచ్చి అతడిని కాలితో తన్నాడు. అంతటితో ఆగకుండా నరేష్ తల్లిని, సోదరీమణులను దుర్భాషలాడాడు. ఈ అనూహ్య పరిణామంతో తీవ్ర ఆగ్రహానికి గురైన నరేష్.. పక్కనే ఉన్న చపాతీ కర్రతో మహాదేవ్ వీపుపై, తలపై బలంగా కొట్టడంతో అది విరిగిపోయింది. ఆ తర్వాత పక్కనే ఉన్న మరో చెక్క బల్లతో మెడపై రెండుసార్లు బలంగా మోదడంతో మహాదేవ్ అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు. అనంతరం మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి సమీపంలోని పొదల్లో పడేసి, తన బ్యాగ్ తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.

ఒకే ఒక్క ఫోన్ కాల్..

హత్య చేసిన తర్వాత యార్డ్ నుంచి బయటకు వచ్చిన నరేష్, సమీపంలోని ఓ వ్యక్తి ఫోన్ తీసుకుని తన బంధువులకు కాల్ చేశాడు. తాను మహాదేవ్‌ను చంపేశానని, ఇంటికి తిరిగి వస్తున్నానని చెప్పాడు. ఈ కేసును సవాలుగా తీసుకున్న న్యూపోర్టు పోలీసులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు తన స్వగ్రామానికి వెళ్తున్నాడని భావించి ఒక బృందాన్ని చత్తీస్‌గఢ్‌కు పంపారు. అయితే నిందితుడు చేసిన ఆ ఒక్క ఫోన్ కాల్ ఆధారంగా పోలీసులు కేసు చిక్కుముడిని విప్పారు. కాల్ చేసిన నంబర్‌ను ట్రేస్ చేసి, ఆ ఫోన్ యజమానిని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడు ఇంకా పెదగంట్యాడలోనే ఉన్నాడని నిర్ధారించుకున్న పోలీసులు.. వెంకన్నపాలెం జంక్షన్ వద్ద అతడిని చాకచక్యంగా అరెస్టు చేశారు. ఈ హత్య కేసును ఛేదించిన న్యూపోర్టు పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. సమావేశంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్


మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్

సీతంపేట: నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటిస్తే.. నేడు దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏది జరిగినా ముస్లింలే కారణమంటూ పాలకులు తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నేడు రాజకీయ నిరంకుశత్వంతో పాటు ఆర్ఎస్ఎస్ సాంస్కృతిక సైన్యం ఉందని, ఇది హిట్లర్ ప్రైవేట్ ఆర్మీలా తయారైందని ఆరోపించారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులు మోదీ ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయని, ఆర్ఎస్ఎస్, కార్పొరేట్ శక్తుల కలయికతో దేశం అంధకారంలోకి వెళ్తోందని మండిపడ్డారు. ఆదివాసీలు, దళితులు, ముస్లింలు, మైనారిటీలను తప్పుదోవ పట్టించే ప్రమాదకర అజెండాను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కశ్మీర్‌లో జరుగుతున్న నరమేధాన్ని బయటకు రానివ్వడం లేదన్నారు. మానవహక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ బీజేపీ ఎమర్జెన్సీని రాజ్యాంగ ధ్వంసంగా అభివర్ణిస్తుందని, కానీ అధికారంలోకి వచ్చాక మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించి, ప్రభుత్వ వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు. గత ఎమర్జెన్సీకి కార్పొరేట్ల మద్దతు లేదని, నేటి అనధికార ఎమర్జెన్సీకి వారి మద్దతు ఉందన్నారు. మీడియా పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయిందని, ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వాలు అణచివేత విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. 2014 నుంచి దేశంలో అనధికార ఎమర్జెన్సీ కొనసాగుతోందని, ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రతినిధి కె.పద్మ, ఇఫ్టూ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలిక పద్ధతిలో మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- సంబల్‌పూర్–నాందేడ్(20809) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్‌కు జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్‌కు జూలై 2వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- భువనేశ్వర్–జునాగఢ్(20837) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బయల్దేరే జునాగఢ్–భువనేశ్వర్(20838) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస కోచ్.
- పూరీ–యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్–పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్.
- విశాఖపట్నం–తిరుపతి(08547) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బయల్దేరే తిరుపతి–విశాఖపట్నం(08548) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్.
- విశాఖపట్నం–చర్లపల్లి (08579) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో చర్లపల్లి– విశాఖపట్నం (08580) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.

నకిలీ కొండ దొర సర్టిఫికెట్‌తో ఉద్యోగం

కస్టమ్స్ సూపరింటెండెంట్‌పై చర్యలకు ఆదేశం

అల్లిపురం: నకిలీ ఎస్టీ (కొండ దొర) కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఎల్‌డీసీ ఉద్యోగం పొందిన జ్ఞానాపురానికి చెందిన నమర్ల సత్యనారాయణ చేసుకున్న అప్పీలును కొట్టివేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నమర్ల సత్యనారాయణ 1980లో చింతపల్లి ఎమ్మార్వో కార్యాలయం ద్వారా కొండ దొర (ఎస్టీ) సర్టిఫికెట్ పొందారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఎస్టీ కేటగిరీలో ఎల్‌డీసీ పోస్టును సంపాదించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కార్యాలయంలో కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే, సత్యనారాయణ పొందిన ఎస్టీ సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ అతని సోదరుడు కోటేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో సత్యనారాయణ ఎస్టీ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై సత్యనారాయణ అప్పీలుకు వెళ్లగా, అప్పిలేట్ అధికారి విచారణ చేపట్టారు. నమర్ల సత్యనారాయణ ఎస్టీ కాదని, అతను చూపించిన బలపం గ్రామంలో ఆ ఇంటి పేరు గల వారు కొండదొర కేటగిరీలో లేరని నిరూపితమైంది. దీంతో అతని అప్పీలును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు విశాఖ కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

భీమిలి బీచ్‌లో 'పాన్ ఇండియా' సందడి


హీరో రోహన్‌పై పాట చిత్రీకరణ

కొమ్మాది: భీమిలి బీచ్‌లో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. వెంకట్ పంపాన దర్శకత్వంలో 'పాన్ ఇండియా'అనే సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను భీమిలి బీచ్ పరిసరాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా రోహన్, హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారని నిర్మాత సాగి సత్యనారాయణ రాజు తెలిపారు. సినిమా షూటింగ్‌ను చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు.

ఉల్లాసంగా బ్యూటీషియన్ డే


డ్యాన్స్‌లు చేస్తున్న బ్యూటీషియన్లు

బీచ్‌రోడ్డు: వరల్డ్ బ్యూటీషియన్ డే సందర్భంగా గురువారం నగరంలోని ఒక హోటల్‌లో బ్యూటీషియన్లు ఘనంగా వేడుకలు నిర్వహించారు. నగరంలోని బ్యూటీషియన్లందరూ ఒకచోట చేరి ఉల్లాసంగా గడిపారు. వేడుకల్లో ఫ్యాషన్ షోలు, డ్యాన్స్‌లు, పాటలు, ఇతర ఆటలతో సందడి చేశారు.

రూ.1.5 లక్షల డిఫెన్స్ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరిధి చిన ఉప్పాడ వద్ద గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రూ.1.50 లక్షలు విలువ చేసే 95 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. ముందుగా ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది ఎం.హేమంత్ అనే వ్యక్తి వద్ద 5 డిఫెన్స్ మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై విచారించగా.. అదే గ్రామంలో ఎల్లారావు అలియాస్ యల్లాజీ అనే వ్యక్తికి చెందిన పాడుబడిన ఇంటిని చూపించాడు. ఈ క్రమంలో వీరిని చూసిన యల్లాజీ పారిపోగా.. సిబ్బంది ఆ ఇంటిని తనిఖీ చేశారు. 86 డిఫెన్స్ మద్యం బాటిళ్లతో పాటు 4 బీరు బాటిళ్లు లభించాయి. యల్లాజీ పరారీలో ఉండగా హేమంత్‌ను అరెస్ట్ చేశారు. మొత్తం 91 మద్యం బాటిళ్లు, 4 బీరు బాటిళ్లను భీమిలి ఎక్సైజ్ సిబ్బందికి అప్పగించారు. సిబ్బంది సీహెచ్ రాజేశ్వరి, ఎస్.శ్రీనివాస్, ఎల్.అరుణకుమారి, కె.వెంకటరావు, కె.వీరభద్రరావు, ఎస్.తిరుపతిరావు జి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

489 మంది సర్టిఫికెట్ల పరిశీలన

మురళీనగర్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం 489 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 86,001 నుంచి 95,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 245 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో జనరల్ హెడ్, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పీఎం భాషా, లెక్చరర్ నాగరాజుతో కూడిన బృందం 95,001 నుంచి 1,04,000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ నిర్వహించింది. మొత్తం 244 మంది సర్టిఫికెట్లు పరిశీలించగా.. వీరిలో 166 మంది బీసీ, 29 మంది ఓసీ, 38 మంది ఎస్సీ, 11 మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం జరిగే కౌన్సెలింగ్‌కు గైస్‌లో 1,04,001 నుంచి 1,12,000 ర్యాంకు వరకు, పాలిటెక్నిక్ కాలేజీలో 1,12,001 నుంచి 1,20,000 ర్యాంకుల విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది.

అడవి దున్నకు దూడ జననం


తల్లి దున్న చెంతలో పిల్ల దున్న

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మరో బుల్లి జంతువు జన్మించింది. రెండు రోజుల కిందట ఒక ఆడ అడవి దున్న, ఒక ఆడ దూడకు జన్మనిచ్చిందని క్యూరేటర్ జి.మంగమ్మ గురువారం తెలిపారు. ఈ దూడ ఆరోగ్యంగా ఉందని, తల్లి దున్న పక్కన ఎన్‌క్లోజర్‌లో ఉత్సాహంగా తిరుగుతోందని పేర్కొన్నారు. ఇది వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం షెడ్యూల్–1కు చెందిన జంతువు. ఈ జననంతో జూలో అడవి దున్నల సంఖ్య పెరిగిందని క్యూరేటర్ తెలిపారు. జూలోని నవజాత జంతువులకు అవసరమైన టీకాలు, వైద్య సేవలు అందిస్తున్నట్లు వెటర్నరీ వైద్యుడు భాను వివరించారు. ఈ ఏడాది మార్చిలో కూడా ఒక అడవి దున్నకు దూడ పుట్టిన విషయం తెలిసిందే.

ఇంటింటికీ రేషన్ పంపిణీ


26వ వార్డులో వృద్ధురాలికి సరకులు అందజేస్తున్న రేషన్ డీలర్

మహారాణిపేట: జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీని సివిల్ సప్లైస్ విభాగం ప్రారంభించింది. తొలి రోజు గురువారం 11 శాతం మంది లబ్ధిదారులకు రేషన్ డీలర్లు వారి ఇళ్ల వద్దే సరకులు అందజేశారు. జిల్లాలో మొత్తం 33,666 మంది వృద్ధులు ఉండగా.. సాయంత్రానికి 3,785 మందికి పంపిణీ పూర్తయిందని డీఎస్‌వో వి.భాస్కర్ తెలిపారు. సాధారణ పంపిణీ తేదీకి నాలుగు రోజుల ముందుగానే వృద్ధులకు ఈ సరకులు అందజేస్తున్నారు.